సాక్షి
జనగామ
మంగళవారం । 18 । జూలై । 2023



నేటి నుంచి శ్రావణమాసం

మహాశివుడికి ప్రీతికరమైన మాసం శ్రావణం. ఈ ఏడాది అధిక మాసం రావడంతో రెండు నెలల పాటు శ్రావణమాసం పూజలు కొనసాగుతాయని కాళేశ్వర ఆలయ అర్చకులు తెలిపారు.

- 8లో ▸



గంజాయి పట్టివేత

కాజీపేట జంక్షన్‌లో రైల్వే పోలీసులు సోమవారం 62 కిలోల గంజాయి పట్టుకున్నారు. దాని విలువ సుమారు రూ.12.40 లక్షలు ఉంటుందన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28^0 /24^0

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో దీపోత్సవం



పాలకుర్తి టౌన్‌: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో సోమవారం ఏకాదశ రుద్రాభిషేకం, గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్‌ రాంచంద్రయ్య శర్మ పర్యవేక్షించారు.

విద్యార్థి గర్జనను విజయవంతం చేయాలి



జనగామ: ప్రభుత్వ విద్యారంగంపై సర్కారు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 20న హనుమకొండ పబ్లిక్‌ గార్డెన్‌లో నిర్వహించే బహుజన విద్యార్థి గర్జనను జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌ నీర్మాల రత్నం పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి జేరిపోతుల కుమార్‌ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్‌ ఆర్‌ఎస్‌.ప్రవీణ్‌కుమార్‌ గురుకులాల కార్యదర్శిగా ఉన్న సమయంలో దళిత, గిరిజన సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అన్ని విభాగాల్లో విజయ కేతనం ఎగుర వేశారని, ప్రస్తుతం బాసర ట్రిపుల్‌ ఐటీ వంటి విద్యా సంస్థల్లో విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. అంతకు ముందు గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ మడిపడిగ చంద్రశేఖర్‌, నాయకులు పి.నీలాద్రి, గద్దం పవన్‌, తేజ్‌, నటరాజ్‌, నవీన్‌, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాకాలనీలో కొనసాగిన నిరసన



జనగామ: మూసి వేసిన కాలనీ రోడ్డును వెంటనే తెరిపించాలని పట్టణ పరిధి సూర్యాపేట రోడ్డులోని దుర్గాకాలనీ వాసులు సోమవారం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ నుంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉందని, వాహనాలు లోనికి రావడం లేదన్నారు. 150 కుటుంబాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించాలని కోరారు. నిరసనలో లక్ష్మానాయక్‌, కోటిరెడ్డి, రమేష్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలి



జనగామ: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్‌ నాయకులు ధర్మభిక్షం, పల్లెర్ల లలిత డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు కోట్లాది రూపాయల బడ్జెట్‌ కేటాయిస్తున్నట్లు పాలకులు గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో శూన్యమన్నారు. వసతి గృహంలో రాత్రి, ఉదయం వాచ్‌మెన్‌ లేకపోవడం దారుణమన్నారు. సమస్య తీవ్రమవుతున్నదని, పరిష్కరించకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. జిల్లా నాయకులు వికాస్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల ఆత్మబంధువు కేసీఆర్‌

జనగామ: మహిళా ఉద్యోగ, కార్మికుల ఆత్మబంధువు సీఎం కేసీఆర్‌ అని తెలంగాణ ప్రభుత్వ స్కూళ్ల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం(బీఆర్‌టీయూ అనుబంధం) భారత రాష్ట్ర ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.బాబాయి అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన వంట కార్మికుల సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం మరో రెండు వేలు పెంచి కేసీఆర్‌ కార్మిక పక్షపాతిగా నిలిచారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు స్కీం వర్కర్లకు వేతానాలు పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తోందని విమర్శించారు. నాయకులు వేముల నర్సింగం, ఎండీ.ఖలీదాబేగం, గుగులోతు రంగమ్మ, వి.నాగమ్మ, రజిత, నసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాలే..

- వాతావరణంలో మార్పులు
- పెరుగుతున్న వైరల్‌ ఫీవర్‌ బాధితులు
- ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో పెరిగిన రద్దీ
- జీపీ కార్మికుల సమ్మెతో నిలిచిన పారిశుద్ధ్య పనులు
- విజృంభిస్తున్న దోమలు

జిల్లాలో సీజనల్‌ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వానాకాలం వచ్చి నెలరోజులవుతోంది. ఉదయం ఉక్కపోత.. రాత్రి ముసురు వర్షం. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరంతోపాటు ఇతర వైరల్‌ ఫీవర్లతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దీనికితోడు జీపీ కార్మికుల సమ్మె కారణంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ స్తంభించిపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పల్లె, పట్టణం తేడా లేకుండా జనం మంచంపడుతున్నారు.

– జనగామ



జనగామ పట్టణంలోని జిల్లా ఆస్పత్రి జనరల్‌ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లా కేంద్రంతో పాటు డివిజన్‌, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి పెరిగింది. జ్వరంతోపాటు వాంతులు, విరేచనాలు, ఒంటి నొప్పులు, నీరసం, తలనొప్పి ఇలా రకరకాల బాధలతో ఆస్పత్రులకు వస్తున్నారు. గడిచిన రెండు వారాలుగా ఓపీ, ఇన్‌ పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు సాధారణ జ్వరాలుగా నిర్ధారణ చేయగా.. ఇప్పటి వరకు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా కేసులు నమోదు కాలేదు. అయితే రఘునాథపల్లికి చెందిన ఓ వ్యక్తి వారం క్రితం అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన తర్వాత డెంగీ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారు.

12 రోజులు.. ఓపీ–13,553.. ఐపీ–493

జనగామలో జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రితో పాటు 16 పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ఉన్నాయి. గడిచిన 12 రోజుల్లో ఈ ఆస్పత్రుల్లో 13,553 మంది ఓపీలో పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 493 మంది వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్‌ అయ్యారు. జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల నుంచి రోజువారీగా వచ్చే రక్త పరీక్షలకు సంబంధించి ఇప్పటి వరకు 6,657 శాంపిల్స్‌ సేకరించగా.. 12,821 టెస్టులు, ఎ62,835 అంతర్గత పరీక్షలు నిర్వహించారు.

మూడు నెలలకు సరిపడా మందులు..

సీజనల్‌ వ్యాధులు మరింత పరిగే అవకాశం ఉండడంతో అందుకు తగినట్టుగా ఆస్పత్రుల్లో మూడు నెలలకు సరిపడా అవసరమైన మందులు నిల్వ ఉంచారు. అలాగే డెంగీ పాజిటివ్‌ కేసులు నమోదైనా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో 323 ఎస్‌ఎఫ్‌టీస్‌ ఓజోన్‌ ప్లాస్మాలు, డోనర్‌ ప్లేట్‌లెట్స్‌ అవసరమైన మేర ఉన్నాయి.



పై ఫొటోలో చికిత్స పొందుతున్న మహిళ పేరు బాలగోని శ్రీలత. బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈమె నాలుగు రోజులుగా తీవ్ర జ్వరం, కాళ్ల నొప్పులతో బాధపడుతూ స్థానిక సీహెచ్‌సీలో అడ్మిట్‌ అయింది. వైద్యులు రక్త పరీక్షలు చేసి వైరల్‌ ఫీవర్‌గా నిర్ధారించి ట్రీట్‌మెంట్‌ మొదలు పెట్టారు. అవసరమైన ఇంజక్షన్లు, సెలైన్‌ ఇస్తున్నారు. ప్రస్తుతం శ్రీలత ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పారు. 'ఇంటికాడ చానా ఇబ్బంది పడ్డ. ఇక్కడికి వచ్చిన తర్వాత పానం అలుకగ అయింది' అని శ్రీలత పేర్కొంది.



జిల్లా ఆస్పత్రిలో క్యూ కట్టిన ఔట్‌ పేషంట్లు

జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి, మండలాల పరిధి పీహెచ్‌సీల్లో ఈనెల 5 నుంచి 16 వరకు ఇన్‌, ఔట్‌ పేషంట్ల వివరాలు

	ఓపీ	ఐపీ
జిల్లా ఆస్పత్రి	3,748	339
లింగాలఘణపురం	850	–
చిల్పూరు	636	12
కొడకండ్ల	501	–
బచ్చన్నపేట	1,448	50
జఫర్‌గఢ్‌	1,150	–
స్టేషన్‌ఘన్‌పూర్‌	920	52
ఇప్పగూడెం	525	–
తాటికొండ	465	03
రఘునాథపల్లి	838	20
కోమళ్ల	425	–
దేవరుప్పుల	640	17
పాలకుర్తి	1,407	–
మొత్తం	13,553	493

ఆందోళన వద్దు

సీజనల్‌ వ్యాధులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం, ఆస్పత్రులకు ఓపీ సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా కేసులు నమోదు కాలేదు. డెంగీ వచ్చినా జిల్లా ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్‌ అందుబాటులో ఉంది. ఎండీ, ఎంఎస్‌, ఆర్థో, అనస్తీషియా, ఇతర కేటగిరీల వారీగా డాక్టర్లు 24 గంటల పాటు వైద్యం అందిస్తున్నారు. సీహెచ్‌సీల వారీగా వైద్యం అందుబాటులో ఉంది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి.



- డాక్టర్‌ సుగుణాకర్‌రాజు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌

రైతుల ఆత్మగౌరవం పెరిగింది

- వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై రేవంత్‌ వ్యాఖ్యలు సరికాదు
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ముత్తారంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి: తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది.. సాగునీరు అందుబాటులోకి రావడంతో భూముల విలువ పెరిగి రైతుల ఆత్మగౌరవం పెరిగిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని ముత్తారం, పాలకుర్తి రైతు వేదికల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గతంలో నీటి సదుపాయం లేకనే మన భూముల విలువ పడిపోయిందని, తెలంగాణ వచ్చాక నీటి వనరులు అందుబాటులోకి వచ్చాయని, నిరంతర విద్యుత్‌తో వ్యవసాయం పండుగలా మారిందని చెప్పారు. కేవలం మూడు గంటలు మాత్రమే విద్యుత్‌ సరఫరా అవుతోందని టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. సీఎం కేసీఆర్‌ పెండింగ్‌ ప్రాజెక్టులు పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని, రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొంటోందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌, జెడ్పీటీసీ పి.శ్రీనివాసరావు, జిల్లా పరిషత్‌ కోఆప్షన్‌ సభ్యుడు ఎండీ.మదార్‌, చిట్యాల అయిలమ్మ వ్యవసాయ మార్కెట్‌ చైర్మన్‌ ముస్కు రాంబాబు, సర్పంచ్‌లు యాకాంతరావు, భాస్కర్‌రెడ్డి, కర్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్‌ మేళా ప్రారంభం

నియోజకవర్గంలో ఉచిత డ్రైవింగ్‌ లైసెన్స్‌ మేళాను మంత్రి దయాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. పాలకుర్తి కార్యాలయంలో సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు.

మంత్రికి వైద్యుల స్వాగతం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అమెరికా పర్యటన ముగించుకుని పాలకుర్తికి వచ్చిన సందర్భంగా ఆయనకు వైద్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్‌ సుగుణాకర్‌రాజు, డాక్టర్‌ విజయ్‌కుమార్‌, డాక్టర్‌ రవిరాథోడ్‌, నవీన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత ఉండాలి

- అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌ దేశాయ్‌



కూనూర్‌లో ఇంకుడుగుంత పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌

జఫర్‌గఢ్‌/లింగాలఘణపురం: ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించుకోవాలి.. ఇందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌దేశాయ్‌ అన్నారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్‌'లో ఎంపికైన జఫర్‌గఢ్‌ మండలం కూనూర్‌, లింగాలఘణపురం మండలం సిరిపురం గ్రామాల్లో చేపట్టిన పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం జీపీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ.. 'స్వచ్ఛ సర్వేక్షణ్‌' పోటీకి ఎంపికైన ఈ గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, రెండు గుంతల మరుగుదొడ్డి ఉండాలని, తడి, పొడిచెత్తను వేరుచేసి ట్రాక్టర్‌ ద్వారా తరలించే కార్యక్రమాలు వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఇందుకు వార్డుల వారీగా జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. రోజూ ఉదయం 5.30 గంటల వరకే పనులు ప్రారంభం కావాలని, రెండు రోజుల్లో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పలు పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీపీఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ వసంత తదితరులు ఉన్నారు.

టమాట @ రూ.130



జనగామ: జిల్లాలో సోమవారం టమాట ధర రికార్డు నెలకొల్పింది. హోల్‌సేల్‌ మార్కెట్‌లో కిలో రూ.120 పలుకుతుండగా.. రిటేయిల్‌ షాపుల్లో రూ.130 వరకు విక్రయించారు. ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్రంలో టమాట పంట పూర్తిగా దెబ్బతినగా.. అక్కడక్కడా మిగిలిన తోటలను కోతులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ఏపీలోని చిత్తూరు, తదితర జిల్లాల నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాలకు టమాట సరఫరా చేస్తున్నారు. దీంతో ధర విపరీతంగా పెరిగింది. జనగామలో పెరిగిన ధరలు చూసి కొనుగోలుదారులు 'అమ్మో' అంటున్నారు. కూరగాయల వ్యాపారులు మాత్రం నష్టం చవిచూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క టమాట కుళ్లిపోయినా.. రూ.5 వరకు నష్టపోవాల్సిందే అని, ధర ఎక్కువైనా కష్టమర్ల కోసం తెప్పిస్తున్నామని అంటున్నారు.

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- యూటీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి



మాట్లాడుతున్న చావా రవి

జనగామ: గురుకుల పాఠశాలల టీచర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్‌ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యాన కలెక్టరేట్‌ ఆవరణలో జరిగిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా నిలిచిన గురుకులాల విద్యార్థులు సాధించిన విజయాల వెనుక ఉన్న ఉపాధ్యాయుల శ్రమను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు హౌస్‌మాస్టర్‌, కేర్‌టేకర్‌, డిప్యూటీవార్డెన్‌, సూపర్‌వైజరీ స్టడీస్‌, నైట్‌స్టే, ఎస్కార్ట్‌ తదితర విధులను నిర్వహిస్తున్నారని చెప్పారు. 24 గంటలపాటు పనిచేస్తూ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతున్నా వారి శమకు తగిన వేతనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించి స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్‌ చేశారు. రెగ్యులర్‌ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌, గెస్ట్‌, పార్ట్‌ టైం టీచర్లకు కనీస వేతనాలు లేవని, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేదంటే వచ్చే నెల 5న రాష్ట్ర స్థాయిలో ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్‌కుమార్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్‌, సోషల్‌ వెల్ఫేర్‌ బాధ్యులు చంద్రశేఖర్‌, వేణుమాధవ్‌రావు, కిషన్‌, కృష్ణ, వేదాంతచారి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనాలి

- కల్నల్‌ డాక్టర్‌ మాచర్ల భిక్షపతి



మాట్లాడుతున్న డాక్టర్‌ భిక్షపతి

జనగామ: 'కార్గిల్‌ విజయ దివస్‌'పై రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని తెలంగాణ మాజీ సైనిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కల్నల్‌ డాక్టర్‌ మాచర్ల భిక్షపతి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగి సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'నేనే సైనికుడి నైతే' అనే అంశంపై 20 నుంచి 25 ఏళ్ల వయసు వారు, 'దేశ రక్షణలో సైనికుని పాత్ర' అంశంపై 15 నుంచి 19 ఏళ్లవారు, 'కార్గిల్‌ యుద్ధం' అంశంపై 10 నుంచి 14 ఏళ్ల వారు, 'జై జవాన్‌ జైకిసాన్‌' అంశంపై 5 నుంచి తొమ్మిదేళ్ల వారు చిత్రలేఖనంలో పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు నగదు పారితోషికం, ప్రశంసాపత్రాలు అందజేస్తామని చెప్పారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు చిత్రలేఖనం ప్రతులకు జనన ధ్రువీకరణ పత్రాలు జతచేసి హెచ్‌ఎం, ప్రిన్సిపాల్‌ సంతకంతో ఈనెల 22వ తేదీలోపు పంపాలని సూచించారు. చిరునామా తదితర వివరాల కోసం 83280 45552 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిర్ర రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దరిపెల్లి అరవిందాచార్యులు, ఉపాధ్యక్షుడు సయ్యద్‌ యూసుఫ్‌, రాష్ట్ర సైనిక్‌ బోర్డు మెంబర్‌ దండ్యాల కరుణాకర్‌రెడ్డి, వనమాల సోమయ్య, పల్లా జయపాల్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపట్నుంచి బీఫార్మసీ ఏడో సెమిస్టర్‌ సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్‌: కేయూ పరిధిలో బీఫార్మసీ 7వ సెమిస్టర్‌ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ రాధిక తెలిపారు. ఈనెల 19న మొదటి పేపర్‌ ఇన్‌స్ట్రుమెంటల్‌ మెథడ్స్‌ ఆఫ్‌ అనాలసిస్‌, 21న రెండో పేపర్‌ ఇండస్ట్రియల్‌ ఫార్మసీ–2, 24న మూడో పేపర్‌ ఫార్మసీ ప్రాక్టీస్‌, 26న నాలుగో పేపర్‌ నావెల్‌ డ్రగ్‌ డెలివరీ సిస్టమ్‌ పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉంటాయని వివరించారు.

గరం గరం.. ఓరుగల్లు రాజకీయం

- 'అసెంబ్లీ'పై కన్నేసిన ఎమ్మెల్సీలు, ఎంపీలు
- అభద్రతలో సిట్టింగ్‌ ఎమ్మెల్యేలు
- రోజుకో తీరుగా రాజకీయ పరిణామం
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో చల్లారని మంటలు
- వర్ధన్నపేటకు పాకిన 'సెగ'
- మరో ఐదు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి..
- తాజా పరిణామాలపై బీఆర్‌ఎస్‌ అధిష్టానం ఆరా?
- త్వరలోనే అధినేత పోస్టుమార్టం?.. కీలక నేతలకు సంకేతాలు



సాక్షిప్రతినిధి, వరంగల్‌: అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఉమ్మడి వరంగల్‌ జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఆరునూరైనా.. ఈసారి గెలిచి తీరాలనే లక్ష్యంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలు రచిస్తుండగా.. అధికార పార్టీలో రచ్చకెక్కుతున్న అంతర్గత కుమ్ములాటలు ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాల్లో 11 చోట్ల 'సిట్టింగ్‌'లున్న బీఆర్‌ఎస్‌కు.. సగానికంటే ఎక్కువ స్థానాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈసారి ఎంపీలు, ఎమ్మెల్సీలు సైతం అసెంబ్లీపై కన్నేయడంతో టిక్కెట్ల పోరు ముదురుతోంది. ఎవరికి వారుగా పర్యటనలు, ప్రయత్నాలు చేస్తుండటంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య అగాధం పెరుగుతోంది. ఇదే క్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో మొదలైన మాటల మంటలు.. క్రమేపీ అన్ని నియోజకవర్గాలకు పాకుతుండగా.. అధిష్టానం రంగంలోకి దిగి ఆరా తీస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే అవుదామనే... కన్నేసిన ఎంపీలు, ఎమ్మెల్సీలు

కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నందున సిట్టింగ్‌లు తమ సీట్లను పదిలపర్చుకునే ప్రయత్నంలో ఉండగా.. ఎంపీలు, ఎమ్మెల్సీలుగా ఉన్న పలువురు ఎమ్మెల్యే టికెట్ల వేటలో పడటం హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడే మొదలైన అసలు పంచాయితీ ఆ పార్టీ సిట్టింగ్‌లకు కునుకు లేకుండా చేస్తోంది. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య చాలాచోట్ల నువ్వా నేనా అన్నట్లు సాగుతున్న రాజకీయ రగడ రోజురోజుకూ రాజుకుంటోంది. వరంగల్‌ ఎంపీగా ఉన్న పసునూరు దయాకర్‌ ఈసారి ఎమ్మెల్యే కావాలనుకుంటున్నారట. దీంతో ఆయన వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎక్కడిచ్చినా పరవాలేదన్న సంకేతాలను అధిష్టానానికి తెలియజేసినట్లు ప్రచారం. ఇదే సమయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఈసారి టికెట్‌ ఇవ్వొద్దని ఆ నియోజకవర్గానికి చెందిన కొందరు ముఖ్యనేతలు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్‌లకు ఆదివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. మహబూబాబాద్‌ పార్లమెంట్‌ సభ్యురాలు మాలోతు కవిత గత ఎన్నికల్లో దక్కని ఎమ్మెల్యే అవకాశాన్ని ఈసారి అందిపుచ్చుకోవాలనే క్రమంలో గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు ఆమె అనుచర వర్గాలే చెబుతున్నాయి. ఎమ్మెల్సీ టి.రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ల మధ్య ఉన్న గ్యాప్‌ కూడా కలిసొస్తుందనే ఆశలో ఉన్నారు. అయితే ఈ వివాదం ఇటీవల మరింత ముదరగా.. ఆ ఇద్దరికీ అధిష్టానం నుంచి పిలుపు అందింది. ఇక ఎమ్మెల్సీలుగా ఉన్న సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లిలో ఈ మధ్య చురుగ్గా తిరుగుతుండటంపై ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వర్గంలో చర్చ జరుగుతుండగా, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి జనగామ నియోజకవర్గం అభ్యర్థి కాబోతున్నాడన్న ప్రచారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వ్యతిరేక వర్గం ప్రచారం చేస్తోంది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేరు సైతం టికెట్‌ రేసులో వినిపిస్తోంది. నియోజకవర్గాల్లో పర్యటించే క్రమంలో వరంగల్‌ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల సిట్టింగ్‌ ఎమ్మెల్యేలను గెలిపించాలని ప్రకటించిన మంత్రి కేటీఆర్‌.. వరంగల్‌ తూర్పులో ఆ మాటెత్తలేదు. దీంతో ఎమ్మెల్యే నరేందర్‌ టికెట్‌ మార్పు ఖాయమన్న చర్చ సాగుతోంది. ఇదే సమయంలో అంతర్గత సమావేశాల్లో సొంత గూటిలోని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్‌ గుండు సుధారాణి పోటీకొస్తున్నారని భావించి వారి తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నట్టు కార్యకర్తలు చెబుతున్నారు.

తారాస్థాయిలో 'స్టేషన్‌' మంటలు.. ముదురుతున్న డోర్నకల్‌ వివాదం..

స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గం ఎమ్మెల్యే డా.తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య రెండేళ్లుగా రగులుతున్న అంతర్గత విభేదాలు ఇటీవల తారస్థాయికి చేరాయి. కడియం శ్రీహరి ఇటీవల సభలు, సమావేశాలు నిర్వహించిన సందర్భంగా బ్యానర్లు, ఫ్లెక్సీలతో హంగామా చేశారు. ఈ క్రమంలో ఆయనకు అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్‌ వచ్చిందన్న ప్రచారం జరిగింది. దీంతో ఎమ్మెల్యే రాజయ్య... ఫ్లెక్సీలు, బ్యానర్ల కోసం శ్రీహరి మండలానికి రూ.10 లక్షలు పంపించారని, ఆయనకు ఇంత డబ్బు ఎక్కడిదని ప్రశ్నించడంతోపాటు పలు వ్యాఖ్యలు చేశారు. ఈ విమర్శలపై మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కడియం శ్రీహరి కూడా కౌంటర్‌ ఇచ్చారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే రాజయ్యను కేటీఆర్‌ ప్రగతిభవన్‌ పిలిచి మాట్లాడటంతో సద్దుమణిగినట్లు కనిపిస్తున్నా 'స్టేషన్‌'లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులానే ఉంది. సీనియర్‌ నేత, మాజీ మంత్రి డీఎస్‌ రెడ్యానాయక్‌కు రెండు రోజులుగా నిరసనలు, నిలదీతల సెగ పెరిగింది. డోర్నకల్‌ టికెట్‌ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఇస్తారన్న ప్రచారం కొద్ది రోజులుగా జరుగుతుండగా.. ఆమె అనుచరులు సైతం అధికార పార్టీకి చెందిన తనను అడ్డుకోవడంపై రెడ్యానాయక్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మంత్రి సత్యవతి రాథోడ్‌, డీఎస్‌ రెడ్యానాయక్‌ల మధ్య వివాదం మరింత ముదిరింది. కాగా కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌ అధికార బీఆర్‌ఎస్‌ పార్టీలో చోటు చేసుకుంటున్న రోజుకో రకమైన పరిణామాలు, సమీకరణలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇదిలా ఉండగా ఉమ్మడి వరంగల్‌ బీఆర్‌ఎస్‌లో తాజా రాజకీయ పరిణామాలపై పార్టీ అధిష్టానం సోమవారం ఆరా తీసినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన మహబూబాబాద్‌, స్టేషన్‌ఘన్‌పూర్‌, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల అంశాలపై ఇద్దరు కీలక నేతలతో కేటీఆర్‌ మాట్లాడినట్లు సమాచారం. త్వరలోనే ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో తాజా పరిణామాలపై పోస్టుమార్టం నిర్వహించవచ్చని బీఆర్‌ఎస్‌కు చెందిన కీలక నేత ఒకరు చెప్పారు.

క్లుప్తంగా

హాస్టల్ భవనంపై నుంచి జారిపడిన విద్యార్థిని

● ఆస్పత్రికి తరలింపు

కేసముద్రం: హాస్టల్ మొదటి అంతస్తుపై నుంచి విద్యార్థిని ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిన సంఘటన ఇనుగుర్తిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా గోర్లపాడుకు చెందిన సౌమ్య ఇనుగుర్తి గురుకుల కళాశాలలో హెచ్ఈసీ సెకండియర్ చదువుతుంది. ఈ మేరకు మొదటి అంతస్తు నుంచి విద్యార్థినులతో కలిసి సౌమ్య కిందికి దిగుతుండగా, ప్రమాదవశాత్తు ఆమె కాలు స్లిప్‌కావడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న డయాస్‌పై పడింది. దీంతో ఆమె కుడి కాలుకు గాయం కాగా హుటాహుటిన మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని అధ్యాపకులు తెలిపారు. సౌమ్య కావాలనే మొదటి అంతస్తు నుండి దూకినట్లు అక్కడున్న తోటి విద్యార్థినులు చెబుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జరిగిన ఘటనపై అధికారులు విచారణ జరుపనున్నట్లు తెలిసింది.

అధికారులపై తేనెటీగల దాడి

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని లక్ష్మీబ్యారేజీ వద్ద అధికారులపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. జిల్లా సివిల్ జడ్జి జయరాం, ఎస్పీ సురేందర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పలిమెల మండలంలో న్యాయ సహాయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో లక్ష్మీబ్యారేజీ వీక్షించడానికి వెళ్లగా అక్కడ తేనేటీగలు ప్రాజెక్టు గోడకు తెట్ట పెట్టి ఉంది. వరద తాకిడికి తేనెటీగలు ఒక్కసారిగా లేచి స్వైరవిహారం చేయడంతో ఎస్సై రాజ్‌కుమార్, కోర్టు పీపీ, ఇద్దరు సిబ్బంది, కానిస్టేబుల్‌పై దాడి చేశాయి. జడ్జి, ఎస్పీలకు తేనెటీగల దాడి జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గాయపడిన వారిని మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి శ్రావణ మాసం షురూ!

● అధిక మాసంతో రెండు నెలలు శ్రావణమే
● 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక మాసం
● ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిజశ్రావణం
● రెండు నెలల పాటు లక్షపత్రి పూజలకు అవకాశం
● శివనామస్మరణతో మార్మోగనున్న కాళేశ్వరాలయం


కాళేశ్వరాలయం

కాళేశ్వరం : మహాశివునికి ప్రీతికరమైన మాసం శ్రావణమాసం. రెండు నెలల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మంగళవారం ప్రారంభం కానుంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధికమాస శ్రావణం, ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిజ శ్రావణ వచ్చినట్లు వేదపండితులు చెబుతున్నారు. ఈ రెండు నెలల పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శివనామస్మరణతో మారుమోగనుంది.

అధిక మాసం అంటే :
శాస్త్రం ప్రకారం కాలగణన సూర్యుడు, చంద్రుల ఆధారంగా జరుగుతుంది. సూర్యుడి ఆధారంగా లెక్క కట్టే కాలమానాన్ని 'సౌరమానం'అని, చంద్రుడుని ఆధారంగా లెక్కకట్టే కాలమానాన్ని 'చంద్ర మానం' అంటారు. చంద్రమానంలో నెలకు 29.53 రోజులు. దీని ప్రకారం చంద్రమానం ఏడాదికి 354 రోజులు. సౌరమానంలో ఏడాదికి 365 రోజులు. సౌరమానానికి, చంద్రమానానికి మధ్య ఏడాదిలో 11 రోజులు తేడా ఉంది. ఈ మధ్య తేడాను సరి చేయడానికి 32 నెలలకోసారి ఈ మాసాన్ని అధికంగా కలుపుతారు. దానినే 'అధిక మాసం' అంటారు. ఈ మాసంలో దేవతారాధనలు చేయడానికి విశిష్టత. కానీ శుభకార్యాలు చేయరాదు. దీనినే 'పురుషోత్తమ మాసం'అంటారు.

నిజ శ్రావణమాసం
శ్రావణమాసంలో తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి వారి గర్భగుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతి రోజు సాయంత్రం వేళల్లో భక్తులు అధికంగా బిల్వ దళాలతో (లక్షపత్రి) పూజను మహా శివున్ని పూజిస్తారు. ఒక జంటకు (భార్యభర్తలకు) రూ. 6వేల టికెట్‌తో ఒక రోజు ఐదుగురికి మాత్రమే ఈ పూజను నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుంది. రెండు నెలలు ఉండడంతో అధికంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వార్లకు భక్తులు అత్యధికంగా రూ.1000 టికెట్ చెల్లించి అభిషేక పూజలు నిర్వహిస్తారు. కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందదేవి(పార్వతీ), శ్రీసరస్వతీ అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు.

రెండు నెలలు దేవతారాధన చేయవచ్చు



ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండు నెలలు శ్రావణమాసం ఉంటుంది. ఈ రెండు నెలల్లో మొదటి అధిక శ్రావణమాసం, నిజ శ్రావణమాసాల్లో రెండు నెలలు దేవతామూర్తులకు పూజలు నిర్వహిస్తే చాలా మంచిది. కానీ అధిక మాసంలో శుభ కార్యాలు చేయద్దు. నిజశ్రావణమాసంలో శుభ కార్యాలకు అనుకూలం. ఈ రెండు మాసాల్లో ఆలయంలో లక్షపత్రి పూజలు నిర్వహిస్తే మహాశివుని కరుణ కటాక్షంతో ముక్తి లభిస్తుంది.

– పనకంటి ఫణీంద్రశర్మ, ఆలయ ముఖ్యఅర్చకుడు

లక్షపత్రి పూజలకు సిద్ధం



ఈ ఏడాది అధిక, నిజ శ్రావణ మాసాలతో రెండు నెలలు లక్షపత్రి పూజలు చేసేందుకు అంతా సిద్ధం చేశాం. ఇప్పటికే బిల్వదళాలు తెచ్చేందుకు గిరిజనులను ఏర్పాటు చేశాం. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా లక్షపత్రి పూజలకు అడ్వాన్స్‌గా టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా అర్చకులను ఏర్పాటు చేస్తాం. రద్దీతో ప్రసాదాల తయారీ చేస్తాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్నీ ఏర్పాటు చేస్తున్నాం.

– ఎస్.మహేష్, ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

రేవంత్, కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ టి.రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు

● మూడు గంటల కరెంట్ ఎలా సరిపోతది..
● క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం
● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్ : రైతులను కించపరిచే విధంగా వ్యాఖ్యానించిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు భేషరతుగా క్షమాపణలు చెప్పే వరకు తెలంగాణ వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. పైరవీలు, బ్రోకర్‌గా పనిచేసే రేవంత్‌రెడ్డి.. రైతులు, వారి సమస్యలపై అవగాహన లేక ఉచిత కరెంట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ, నేతల తీరుపై ఇంకా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సోమవారం హనుమకొండలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. ఒకప్పుడు కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్సే అని టీడీపీలో ఉన్నప్పుడు తనతో కలిసి అసెంబ్లీ లోపల, ఎదుట ధర్నాలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ తరపున వకాల్తా పుచ్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కరెంట్ లేక ఎండిపోయిన పొలాలు చూసి భూమి ఉందంటే పిల్లను ఇవ్వలేదని, ఇప్పుడు భూమి ఉందంటేనే పిల్లనిచ్చే పరిస్థితి కేసీఆర్, బీఆర్ఎస్ పాలనలో వచ్చిందన్నారు. 'వ్యవసాయానికి కేవలం 3 గంటల కరెంటు చాలట. ఒక గంట కరెంటుతో ఒక ఎకరం పారించవచ్చట. వ్యవసాయం గురించి తెలిసినోడు మాట్లాడే మాటలేనా?.. రేవంత్‌రెడ్డికి అసలు సిగ్గుందా'అని మంత్రి దయాకర్‌రావు ప్రశ్నించారు. భేషరతుగా క్షమాపణలు చెప్పేదాకా విడిచిపెట్టబోమన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కడతారని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు తమ దరిదాపుల్లోనే లేవని.. రెండో స్థానం కోసం ఆ రెండు పార్టీలు పోటీపడుతున్నాయన్నారు. కాళేశ్వరం మహత్తర ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రతిపక్షపార్టీల నాయకులు రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. 'ఎక్కడ చూసినా ప్రాజెక్టుల్లో నీరు పారుతోంది.. చెరువులు, కుంటల్లో నీరు చేరి భూగర్భజలాలు పెరిగాయి.. భూముల ధరలు విపరీతంగా పెరిగింది. నేను కూడా రూ.2 లక్షల ఎకరం చొప్పున కొనుగోలు చేసిన భూమిని గత ఎన్నికల సమయంలో రూ.40 లక్షలకు ఎకరం చొప్పున అమ్మినా... ఇప్పుడా భూమి ధర ఎకరం రూ.కోటికి చేరింది. స్వరాష్ట్రంలో ఎనిమిదేళ్లలో జరిగిన అభివృద్ధి, మార్పులకు ఇవే నిదర్శనం'అని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డా.టి.రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు పాల్గొన్నారు.

నాగులమ్మ గుడిలో సూర్యుడి విగ్రహం

● గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి


రాతి విగ్రహాలను పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

కొడకండ్ల: జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని నాగులమ్మ గుడి ప్రాంగణంలో సూర్యుడి విగ్రహం గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ధర్మకర్తలు సింగరం చంద్రయ్య, గోధుమల సోమయ్య, వెంకటయ్య ఆహ్వానం మేరకు నెలపోగుల సందీప్‌తో కలిసి రత్నాకర్‌రెడ్డి నాగులమ్మ కుంట, బయ్యన్నవాగు రిజర్వాయర్‌లో కలిసిన కునారెడ్డి కుంట పరిసరాలు, పాటిగడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం నాగులమ్మ గుడిలో సూర్యుడి విగ్రహం ఉన్నట్లు గతంలో గుర్తించామని, ఈ ఆలయానికి పైనుంచి వెలుతురు పడేలా రంధ్రం ఉందని చెప్పారు. ప్రస్తుతం నాగులమ్మ కుంటకట్ట మీద పూర్వపు నాగులమ్మ గుడికి అర ఫీటు మందం, మూడు మీటర్ల పొడవుతో ఉన్న రాళ్లను ఉపయోగించారని, కట్ట కింద ఉన్న గుడి కూడా ఇదే విధంగా నిర్మించారని చెప్పారు. ఆలయ శిథిలాల్లో నలుమూలలు ఉన్న రాయికి దీర్ఘ చతురస్రాకారంలో తొల్చిన రంధ్రం ఉన్నట్లు గుర్తించామని, ఇది సగభాగం మాత్రమే ప్రస్తుతం ఉందని వివరించారు. దీన్నిబట్టి ఆలయ శిథిలాలు సూర్య దేవాలయానికి చెందినవై ఉండొచ్చని అభిప్రాయ పడ్డారు. గతంలో బయ్యన్న ఆలయంలో ఎంతో అరుదైన బృహత్ శిలా యుగం నాటి మానవాకృత శిల్పం గుర్తించినట్లు పేర్కొన్నారు.

కాజీపేటలో 62 కిలోల గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న జీఆర్పీ సీఐ రాంమూర్తి, ఆర్పీఎఫ్ సీఐ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో రైల్వే పోలీసులు సోమవారం 62 కిలోల గంజాయిని పట్టుకున్నారు. జీఆర్పీ సీఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్ర కారం.. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 3లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీ సులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా రైల్లో గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒడిశాకు చెందిన సత్రజిత్ ప్రధాన్, అజాది తంతిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. వీరి నుంచి సుమారు రూ.12,40,000 విలువ చేసే 31 ప్యాకెట్లలో సుమారు 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ ఎస్సై పరుశరాములు, పోలీసులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య


కళమ్మ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని చక్రంతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కమ్మపల్లి గ్రామశివారు చక్రంతండాకు చెందిన అజ్మీరా కిషన్- కళమ్మ(45) దంపతులకు ఒక ఎకరం వ్యవసాయం భూమి ఉంది. వ్యవసాయంతో పాటు వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తునాడు. వీరి ఒక కుమారుడు రాజేందర్ దివ్యాంగుడు. కుమార్తె హారికకు వివాహమైంది. కిషన్-కళమ్మలకు ఆర్థిక విషయాల్లో తరుచూ గొడవ జరుగుతూ ఉండేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో క్షణికావేశానికి గురైన కళమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. కుటుంబ సభ్యులు చూసి వెంటనే నర్సంపేట ఆస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.


తడబడిన బుడిబుడి అడుగులు..

● తలకిందులుగా బకెట్‌లో పడి 11 నెలలు బాలుడి మృతి


హేమంత్ (ఫైల్)

రఘునాథపల్లి: బుడి బుడి అడుగులు తడబడ్డాయి. ప్రమాదవశాత్తు తలకిందులుగా బకెట్‌లో పడి 11 నెలల బాలుడు మృతిచెందాడు. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎక్కలదేవి లక్ష్మణ్- గీత దంపతులకు ఇద్దరు కుమారులు గోవర్దన్, హేమంత్ (11నెలలు) ఉన్నారు. సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు టైలరింగ్ పనుల్లో నిమగ్నం కాగా చిన్న కుమారుడు హేమంత్ బుడి బుడి అడుగులతో ఇంటి వెనకాల నీళ్లతో ఉన్న బకెట్ వద్దకు వెళ్లి ఆడుతుండగా ప్రమాదవశాత్తు తలకిందులుగా బకెట్లో పడ్డాడు. బాలుడు కనిపించకపోయేసరికి ఇంటి వెనకాల వెతికిచూడగా బకెట్లో తలకిందులుగా పడి మృతిచెంది ఉన్నాడు. తల్లిదండ్రులు రోదిస్తూ వెంటనే బాలుడిని స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు చెప్పాడు. కళ్లముందే కుమారుడు ఆటాడుకుంటూ బకెట్‌లో పడి విగత జీవిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ విలపిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచివేసింది. ఎస్సై రఘుపతి ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి వెళ్లి కార్మికుడు గల్లంతు


రామ్‌సోరణ్ (ఫైల్)

నెక్కొండ: పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం వచ్చిన ఓ హమాలీ కార్మికుడు స్నానానికి అని వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి గల్లంతైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్సై జానీపాష తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన హమాలీ కార్మికులు అన్నదమ్ములు పప్పు సురేణ్, రామ్‌సోరణ్ (22) నెక్కొండలోని చల్లా గోదాముల్లో పనులు చేసేందుకు రెండు నెలల క్రితం వచ్చారు. రోజు మాదిరిగానే రామ్‌సోరణ్ సమీపంలోని కుంటలో స్నానానికి ఒంటరిగా వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి కొట్టుకుపోతుండడంతో తోటి కార్మికులు దూరం నుంచి గమనించారు. వారు వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికి కార్మికుడు నీట మునిగి గల్లంతయ్యాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి అన్న సురేణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై చెప్పారు. పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టినా అతడి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. తోటి కార్మికుడు నీట మునిగి గల్లంతు కావడంతో గోదాములో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన అంబాల రవీందర్ కుమార్తె చందన కుట్టి (25) ఈనెల 3న రాత్రి తెల్లవారు జామున అందరు గాఢనిద్రలో ఉండగా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికారన్నారు. ఎక్కడా కూడా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డులో చోరీ

● రూ.80 వేల విలువ చేసే 19 ఎల్‌వీ కాయిల్స్ మాయం

పరకాల : పరకాల సబ్‌స్టేషన్ ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డులో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. విధులు ముగించుకొని వెళ్లిన సిబ్బంది సోమవారం ఉదయం 8 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డు తెరువగా రూ. 82 విలువ చేసే 19ఎల్‌వీ కాయిల్స్ దొంగతనం జరిగినట్లు గుర్తించి షెడ్డు సబ్‌కాంట్రాక్టర్ భూరెడ్డి మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందజేశారు. గుర్తుతెలియని వ్యక్తులు కిటికి నుంచి షెడ్డులోకి ప్రవేశించి చోరీకి పాల్పడగా మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ..


రాజు (ఫైల్)

కాశిబుగ్గ : ఆర్థిక సమస్యలతో ఓ కూలీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటలోని వడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి రాజు(35) భార్య వనితతో కలిసి మట్టి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు మధ్యాహ్నం నర్సంపేట నుంచి వరంగల్‌కు వచ్చి తన బాబాయ్‌కు తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నాని తెలిపారన్నారు. అప్పటికే చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య వరంగల్ రైల్వేస్టేషన్ వెంబడి శివనగర్ వైపు ఉన్న వినాయక గుడి సమీపంలో అప్‌లైన్‌లో వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతునికి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం వ్యాన్


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన రాజేష్ మృతదేహం


క్యాబిన్‌లో ఆర్తనాదాలు చేస్తున్న మహిళలు

● క్యాబిన్‌లో ఇరుక్కుని వ్యాన్‌డ్రైవర్ మృతి
● నలుగురు మహిళలకు తీవ్రగాయాలు


రాజేష్(ఫైల్)

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సు నెమ్మదిగా వెళ్తున్న క్రమంలో అతివేగంగా వెనుకనుంచి డీసీఎం వ్యాన్ వచ్చి బస్సును బలంగా ఢీకొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా అందులో ఉన్న నలుగురి మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మంగ కథనం ప్రకారం.. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్‌కు వెళ్లి తిరిగి వర్ధన్నపేట బస్టాండ్‌లోకి వెళ్లి తొర్రూరుకు వెళ్తున్న క్రమంలో వరంగల్ నుంచి పత్తి బేళ్లతో సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో అతివేగంగా వస్తూ అదుపు తప్పి ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ తోట రాజేష్(40) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందగా క్యాబిన్‌లో ఉన్న పత్తి బేళ్లను దిగుమతి చేయడానికి వెళుతూ నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ములుగుకు చెందిన సింగం భారతి, వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన పోవుర్సు రజిత, ఆనుక మంజు, వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఎస్‌కె నసీం అలియాస్ ముంతాజ్ ఉన్నారు. వీరు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సుమారు అర్ధగంటకు పైగా వీరు చేసిన ఆర్తనాదాలు పలువురిని కంటతడి పెట్టించాయి. క్యాబిన్ ముందు భాగంలో తాడు కట్టి క్యాబిన్‌ను ముందుకు లాగి వారిని అతి కష్టంగా బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో ఇద్దరిని తరలించగా మరో అంబులెన్సు రాకపోవడంతో ఎదురు చూసి వారిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడుది గీసుకొండ మండలం కీర్తినగర్. రాజేష్‌కు భార్య తిరుపతమ్మ ఉంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అనుమాండ్ల సుధాకర్‌రెడ్డి వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో ప్రయాణికులు క్షేమం
ఆర్టీసీ బస్సులో కేవలం 15 మంది ప్రయాణికులు ఉండడం, వారు ముందు సీట్లలో కూర్చోవడంతో ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఒక వేళ వెనుక సీట్లలో ప్రయాణికులు ఉంటే అతిపెద్ద ప్రమాదం చోటుచేసుకునేదని పలువురు చర్చించుకున్నారు.

ఆదర్శంగా మారాలంటే..

దేశంలో ఆదర్శ గ్రామాల అంటువ్యాధి రావాలి
● విమానంలో వెళ్లేవారు పైనుంచి గంగదేవిపల్లిని చూడాలి
● ఆదర్శగ్రామాలుగా రూపుదిద్దే సూచీని రూపొందిస్తున్నాం
● సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


గంగదేవిపల్లిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గీసుకొండ: 'దేశంలోని గ్రామాలన్నీ గంగదేవిపల్లి, మరియపురంలా ఆదర్శంగా మారాలంటే..ఆదర్శ గ్రామాల అంటువ్యాధి రావాలి...అలాంటిది వస్తే అన్ని గ్రామాలు బాగుపడతాయి. దీని కోసం ఓ సూచీని తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాం' అని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం 'ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేది ఎలా' అనే అంశంపై తన పీహెచ్‌డీ థీసిస్ కోసం మండలంలోని గంగదేవిపల్లి , మరియపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రెండు గ్రామాల్లో ప్రజలతో సమావేశమై వారి అనుభవాలను, అభిప్రాయాలను ప్రశ్నావళి రూపంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గ్రామం ఆదర్శంగా నిలవడానికి గల కారణాలు, మిగతా గ్రామాలు ఆదర్శంగా ఎందుకు మారడం లేదో అనే విషయాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. జర్మనీలోని ఓ ఆదర్శ గ్రామం మీదుగా సమయంలో విమానాన్ని పైలెట్ తక్కువ ఎత్తులో తీసుకుని వెళ్తూ ఆ గ్రామం గురించి ప్రయాణికులకు చెబుతూ చూపిస్తారని, అలాగే గంగదేవిపల్లిని విమానాల్లో వెళ్లే వారు చూసే రోజులు వస్తాయన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీల విషయంలో దేశంలో తెలంగాణ ముందుందని, ఇటీవల ప్రకటించిన 19 కేంద్ర అవార్డుల్లో 12 అవార్డులు తెలంగాణ పల్లెలకు రావడం విశేషం అన్నారు. మహారాష్ట్రలో రాలేగావ్ సిద్ధి గ్రామాన్ని అన్నా హజారే, హివ్రేబజార్‌ను కోకట్‌రావ్‌పవార్ ఆదర్శంగా తీర్చిదిద్దారని, అలాంటి కొందరి కృషితో పలుగ్రామాలు ఆదర్శంగా మారుతున్నాయని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, రాయపర్తి ఎంపీపీ అనిమిరెడ్డి, సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, అల్లం బాలిరెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, గోనె కుమారస్వామి, జాయిన్ ఫర్ డిపార్ట్‌మెంట్ సంస్థ జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, కవిత, పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

మరియపురం సర్పంచ్‌కు ప్రశంసలు
మరియపురంను జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా కేవలం నాలుగేళ్లలోనే తీర్చిదిద్దిన సర్పంచ్ అల్లం బాలిరెడ్డి సేవలను, కృషిని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. సర్పంచ్‌తో పాటు గ్రామ మహిళల అభిప్రాయాలను ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళిలో ఆయన సేకరించారు.